


# విలువలు

చాణక్యచంద్రగుప్త

"బొాబ్బాబు మీకు పున్నెంవుంటుంది ఒక పైసా దరమం సెయ్యండయ్యా యెంతో దీనంగా వుందా గొంతు. వెనుతిరిగి చూశాను. అస్థిపంజరం లాంటి ఆకారం ... నడుం వంగిపోయిందేమో నిటారుగా నిలబడలేనట్టు కర్ర ఊతంతో నిలబడి వుంది...! అన్నంతిని ఎన్నిరోజు లయ్యిందో ఏమో పొట్ట లోపలికిపోయి వుంది.

పైసలు వేసేవారు వేస్తున్నారు. కొంతమంది ఆ మనిషిమీద జాలి కురిపిస్తున్నారు. ఎంతోమంది విసుక్కుంటున్నారు. అవునుమరి! జాలి అయితే చూపించగలరుగాని అతని గోల వినిపించుకునే వారెవరు? పైగా వాళ్ళున్న పరిస్థితిలో విసుగుదల కాకపోతే మరేం చూపించగలరు! అది అసలు కొత్త సినిమా విడుదలఅయినరోజు. ఆ హాలు ముందు అతను యెంతసేపట్నుంచి వున్నాడోయేమో గాని, నేను మాత్రం ఒక అరగంటనుంచి లైనులో నిలబడి టిక్కెట్టుకోసం యెదురుచూస్తూ వున్నాను. ఇంకా మ్యాట్నీ వదలలేదు. దానికి చిహ్నమేమో అన్నట్లు బుక్కింగ్సు ముందు పెద్ద పాముల్లా మెలికలు తిరుగుతూ వున్నారు జనం! "సోడా ... సోడా ... ఏమండీ సోడా కావాలా? .. వేరుశనక్కాయలు...వేరుశనక్కాయలూ..." ఇంకా ఏవేవో చిరుతిళ్ళు అమ్మే వాళ్ళు ... ఆ కొత్త సినిమాపై వ్యాఖ్యానాలూ ... ఆ ప్రదేశమంతా చాలా హడావుడిగా వుంది.

"బాబూ దరమపెబువులు. ఒక్కపైసా దరమంసేసి పున్నెంకట్టుకోండి." దీనంగా ఆ ఆకారం అడుగుతూనేవుంది.

"ఫో, ఫోరా! వెధవా! చెప్తుంటే నీక్కాదు!" ఆ గద్దింపు వినవచ్చినవైపు ఒకసారి తిరిగి చూశాను. టెరికాటన్ పాంటు ... టక్‌చేసి వున్న టెరికాటన్ షర్టు ... చేతికొక ఖరీదైన గడియారం ... కళ్ళకు నల్లని అద్దాలూ ... నల్లగా నిగనిగలాడుతూ ముట్టుకొంటే మాసిపోతాయన్నట్లున్న షూ ... ఆ సూటువాలా మనిషిని చూస్తుంటేనే చెప్పొచ్చు చాలా ఖరీదైనవాడని!

"అయ్యా! ఏదో మీలాంటోల్లు దయ సూపాల ... మేం బతకాల..."

"అరే! చెప్తుంటే నీక్కాదు. అవతలకు ఫో ... అయినా ఏదన్నా పని చేసుకు బతకాలిగాని ... యిదేమిటి..." విసుక్కుంటున్నా డతను.

"కట్టం సెయ్యగలిగితే మాకీ కరమమేం బాబూ! అది సెయ్యలేకేగందా!"

"చూడండి సార్! వాడి తల బిరుసు .. అడుక్కుతినేవాడి కెంత పొగరో! ..." అని తన పక్కనవున్న ఆయనతో అన్నాడు ఆ సూట్‌వాలా!

నాకుమాత్రం ఆ అడుక్కుతినే అతన్ని చూస్తుంటే జాలి వేసింది. ఆ సూటువాలామీద విపరీతమైన కోపం వచ్చింది. "అతను అడుక్కు తింటున్నంత మాత్రాన అతనిపై అధికారం చలాయించే హక్కు అతనికేముంది? ... ముసలి వాడు...కాయకష్టం చేయలేనివాడు...అడుక్కుంటు న్నాడు. అంతమాత్రాన అంత హీనంగా చూసే అధికార మేముంది? చేతనైతే సహాయంచెయ్యాలి... లేకుంటే పొమ్మనాలిగాని ..."

"అయ్యా" అన్న పిలుపుతో యీ లోకంలోకి వచ్చాను. ఎదురుగా ఆ ముసలతను...అప్రయత్నంగా నా చెయ్యి జేబులోకి వెళ్ళింది. చేతికొచ్చిందేంతో తెలిసేలోగానే నా చేతిలో డబ్బు అతని చేతిలో వుంచాను. అది చూసి అతని కళ్ళు మెరవడం గమనించాను. అపుడు నా కళ్ళు అతని చేతివైపుకి మళ్ళాయి. అతని చేతిలో ఒక రూపాయి కాగితం... అది చూసుకొని మురిసిపోతున్నాడతను. అతని కళ్ళు ఆనందంలో మెరిసిపోతున్నాయి. ఆ క్షణం నాకెంతో తృప్తి నిచ్చింది. బహుశా నా పాతికేళ్ళలో అటువంటి తృప్తిని యింతవరకు పొందలేదేమోనని పించింది.

"ఇటువంటివాళ్ళు వుండబట్టే అడుక్కునే వాళ్ళు ఎక్కువవుతున్నారు. పెద్ద మెహర్బానీగా నలుగురూ గొప్పగా తమను గురించే చెప్పుకోవాలనో, ఏమో ధర్మంచేసిపారేస్తారు." సూట్‌వాలా నాపై విసుక్కోవడం నాకు స్పష్టంగా వినిపిస్తోంది. నాకా క్షణంలో అడుక్కుతినేవాళ్ళను ప్రోత్సహించాననే ఆలోచనకంటే ఆ ముసలతని కళ్ళలో కనిపించిన మెరుపువనం, అంతకుముందు దీనంగా వున్న అతని చూపు ... అంతా ఒక్కసారి నా కళ్ళముందు మెదిలింది.

ఇంతలో ఎప్పుడు మ్యాట్నీ వదిలారో ఏమో బుక్కింగ్సు తెరిచి టిక్కెట్లు యిస్తున్నారన్నట్లుగా గోల...ఈలలు...నెమ్మదిగా మా లైను ముందుకు కదులుతోంది. ముందుకు కదుల్తున్నకొద్దీ నాకు టిక్కెట్టు దొరుకుతుందన్న ఆశ పెరుగుతోంది. బుక్కింగు వేపుకు నెమ్మది నెమ్మదిగా కదులుతున్నాం మేము! ... ఇంతలో నా వెనక ఎవరో అరుస్తున్నారు ... "అయ్యో నా పర్సు! ... పర్సు!" అంటూ! అంతే. అంతా ఒక్కసారి వెనక్కితిరిగి చూశాం! ఆ సూట్‌వాలా ముందు నుంచొన్నతను అరుస్తున్నాడు పర్సు పోయిందంటూ! అప్రయత్నంగా అక్కడ నుంచున్నవాళ్ల చేతులన్నీ తమ తమ జేబుల్లోకి పోయాయి. తమ జేబులన్నీ భద్రంగా వున్నట్లు తృప్తిగా నిట్టూరుస్తున్నారు.

ఆ సూట్‌వాలా "ఆ దొంగవెధవ యిటే పరిగెత్తాడండీ! నేను చూశాను. వాడు వెళ్లిం తర్వాత తెలిసింది మీ జేబులో డబ్బు పోయిందని... లేకపోతే..." యింకా ఏమేమిటో మాట్లాడుతున్నాడు. అందరూ ఆ పెద్దమనిషిని ఓదారుస్తున్నారు. సానుభూతి చూపిస్తున్నారు! ఆ గడబిడలో మా ముందున్న లైనంతా చెదిరిపోయింది. దాని స్థానంలో గుంపొకటి చేరింది. ఇక నాకా సినిమా అందదన్న ఆలోచనతో నెమ్మదిగా అక్కడినుంచి యివతలగా నుంచొన్నాను కాస్త రిలీఫ్‌గా వుంటుందని!

ఆ బుక్కింగుముందంతా గోలగోలగా వుంది. ఉన్నట్టుండి నా దృష్టి గుంపులో జేబు కొట్టేస్తున్న వాని చేతిమీద పడింది. అది చూసేసరికి నా కెక్కడలేని ధైర్యం వచ్చినట్లయింది. మెరుపులా వెళ్లి ఆ చేతిని చటుక్కున పట్టుకొన్నాను. ఆ చేతిలో పర్సు! ... అపుడు చూసుకొన్నాడో ఏమో బిక్కమొహంతో బయటికి వస్తున్నాడు పర్సు పోయినతను! అంతలోనే నా కళ్ళు ఆ పర్సు దొంగ వేపు కెళ్లాయి. అతన్ని చూస్తూనే నిర్ఘాంత పోయాను! అతనెవరో కాదు! ... ఆ "సూట్ వాలయే!" పర్సు పోగొట్టుకొన్నతను మా ఇద్దర్నీ చూసి క్షణంలో పరిస్థితిని అర్థంచేసుకున్నాడేమో... పర్సు చూస్తూనే అతని కళ్ళు మెరిశాయి...అంతే! సూట్‌వాలాను గుంపులోనుంచి బయటకు లాగాడు.

"చూడండి సార్ మీరంతా! ... నాజేబులో పర్సు కొట్టేశాడు" అంటూ వివరిస్తున్నాడు పక్కనున్నవాళ్లకు సూటువాలాను చూపిస్తూ.

"పర్సా! ఛఛా ... అదిగో ఆ పెద్దమనిషి కొట్టేస్తుంటే పట్టుకొన్నాను..." ఇంకా ఏవేవో చెప్పుకొస్తున్నాడు సూట్‌వాలా, నన్ను చూపిస్తూ!

స్థాణువైపోయాను! క్షణంపాటు పరిస్థితి అర్థంకా లేదు. నా కళ్లు తిరుగుతున్నట్లు అనిపించాయి! ఏదో మొండిధైర్యంతో నిలదొక్కుకొని చుట్టూ కలయచూశాను.

అక్కడున్న జనం అంతా నాచుట్టూ మూగారు. నాకు క్షణంలో పరిస్థితి అర్థమయ్యింది. వాళ్ళంతా కల్సి నన్ను దొంగగా లెక్కకట్టి ఏం చేస్తారో ఊహించాను. అంతలోనే ఆ పర్సుతను "దొంగవెధవా! పర్సు కొట్టేసింది నీవై తే ఆయనమీద చెప్తావా? సూటువాలాను గట్టిగా ఒక తన్ను తన్నాడు. ఆ తన్నుకి కిందపడ్డ సూటువాలాని చూస్తుంటే ఎందుకో బాధేసింది! చటుక్కున సూట్‌వాలా మీద మరో దెబ్బపడకుండా అడ్డుగా నిలడ్డాను.

"మీరు తప్పుకోండి సార్! ఇలాంటివాళ్లకి తన్నులు తగిలితేగాని బుద్ధిరాదు" అంటూ నామీద నుంచి సూటువాలాని కొట్టబోయాడు అతను.

"తొందరపడి అతన్ని కొట్టకండి! కొట్టినంత మాత్రాన అతను దొంగతనం మానాడని ఎందుకు అనుకోవాలి. ఆలోచించండి!"

"ఆలోచించేదేమిటయ్యా! కొట్టకా..." అన్నారెవరో గుంపులోంచి.

"బుద్ధి చెపితే బాగుపడతాడని నమ్మ... ఏమిటి? తన్నండి వెధవను! కాళ్లు చేతు... విరగ్గొట్టి అవతల పారెయ్యండి." అని కొ... కంఠాలు అరిచాయి.

"మీరు తొందరపడొద్దు! ఏయ్ మిస్ట...! లేచి నిలబడు." అంటూ అతన్ని ముందుకొబెట్టి, అందరివేపు తిరిగి "మీరంతా ఎందుకితని మీద చెయ్యి చేసుకోవడం! ఇతన్ని శిక్షించడానికి పోలీసులు వున్నారు. వాళ్లకు అప్పచెప్పండి."

"చూడు మిస్టర్! ఇందాక ముసలతనికి ఒక రూపాయి వేస్తే ముష్టిని ప్రోత్సహిస్తున్నట్లుగా ఉపన్యాసం యిచ్చావు. మరి నిన్ను ఇప్పుడు వీళ్లనుంచి తప్పిస్తుంటే మాత్రం దొంగతనాన్ని ప్రోత్సహిస్తున్నా ననుకోకు! చూడు మిస్టర్! చదువుకున్నవాడిలా వున్నావు. ఎందుకీ పనికి దిగావో యిప్పుడనవసరం. నీకన్నా యిందాక ఆ ముసలతని వృత్తిలో నిజాయితీ వుంది ... గొప్పతనం వుంది... అతను యిస్తే పుచ్చుకొంటాడు. ఇవ్వకపోతే కనీసం నొచ్చుకోనుకూడా నొచ్చుకోడు. అతని బతుకు కేవలం యితరుల మానవత్వంమీద ఆధారపడివుంది. మరి నువ్వు చేసింది? నీలో వున్న నీచ ప్రవృత్తిపై ఆధారపడి వుంది ... జాగర్త! ఇంకెప్పుడూ ఇలా చెయ్యకు ... పని చేసుకో ... దొరికింది తిను ... పని దొరక్కపోతే అడుక్కుతిను. అదీ చేతకాకపోతే ... ఆపూట పస్తుండు! అంతేగాని దొంగతనాలు మాత్రం చెయ్యకు! నిలకడగా ... నిజాయితీగా బతుకు. ఇందాక ఆ ముసలతనికి చెప్పిన నీతులన్నీ ముందు నువ్వు నేర్చుకో" అంటూ కదిలాను వడి వడిగా. అక్కడున్న వాళ్లందరూ తలోరకంగా వ్యాఖ్యానాలు చేస్తూనేవున్నారు. అవన్నీ నాకేం పట్టనట్టుగానే ముందుకు నడిచాను మౌనంగా. కాని నా మనస్సుమాత్రం అతన్ని గురించి ఆలోచిస్తూనేవుంది.

'నన్ను ప్రేమించు'లో జగదీష్‌బాబు, శుభ

